అపరాత్రిదాకా హాస్పిటల్ లాన్‌లో పచార్లు చేస్తూ గడిపింది. చుట్టూ ఆవరించిన చీకటి. . . ఆకాశంలో నిర్వికారంగా చిరుకాంతుల్ని వెదజల్లుతున్న నక్షత్రాలు. . . సమూహం మధ్య ఏకాంతం లాంటి ఒంటరితనం. . . అలసటగా అర్ధనిమీలితాలౌతున్న నేత్రాలు. . . బాల్యంలోనే దూరమైన తల్లిదండ్రులు- ఇంపోర్టెడ్ కార్లు రెసిడెన్షియల్ స్కూల్స్, విదేశాల్లో చదువు- కలల హవేలీలో పరిమళం కోల్పోతున్న పూలకొమ్మలాంటి జీవితం- ఆకుపచ్చని యౌవన వనంలో వాడిగా రగులుతున్న వెన్నెల రెక్కల కోసం సంకీర్ణంగా సాగిస్తున్న ఒంటరి ప్రయాణం- అసలిది బ్రతుకో లేక వూపిరి ఉద్వేగాల్ని రంగులుగా అద్ది ఆనందించు కోవాలనుకునే శూన్యపు కేన్వాసులాంటి భ్రమో తోచడంలేదు.

“మేడమ్” ఎవరో వచ్చారు ఉద్విగ్నంగా. “మీ గ్రాండ్ పా స్పృహలోకి వచ్చారు-”

క్షణం ఆనందం. వెనువెంటనే అదోలాంటి ఆందోళన.

సన్నగా కంపిస్తూ ఐసియులో అడుగుపెట్టింది.

తననే చూస్తున్నాడో లేక చూస్తూ ఆలోచిస్తున్నాడో అర్థం కావడం లేదు.

“గ్రాండ్ పా” అంది శక్తిని కూడగట్టుకుంటూ.

ఆయన మొహం విభ్రమం. . . చాలా సేపటి నిశ్శబ్దం తర్వాత అన్నారు “ఐ నెవ్వర్ ఎక్స్‌పెక్టెడ్”

అది ఆనందమో లేక వచ్చినందుకు అయిష్టతో ఆమెకు బోధపడలేదు. కాని అలాంటి ప్రతిస్పందన ఆమె కోరనిది.

అంతకన్నా “నువ్వు వస్తావని ఊహించలేదు బేబీ” అంటే ఎక్కువ ఆనందించేదేమో.

పదాల్ని కూడగట్టుకుంటున్నట్టుగా అంది.“యూ ఆర్ ఓకే గ్రాండ్ పా”

“సైనికుడు మరణించాలనుకునేది యుద్ధ రంగంలోనే కృషి- ”

ఉక్రోషంగా చూసిందామె. సెంటిమెంట్స్‌కి అతీతంగా బ్రతకడమే ధ్యేయంగా పెట్టుకున్న ఉపాధ్యాయ సిద్ధాంతాలకీ ఆమెకూ మధ్య ఘర్షణ ఈనాటిది కాదు. . . “మీరు రిలాక్స్ కండి”

ఆమె బయటికి నడిచేదే. . .

“ఆగు” ఆయన కంఠం మృదువుగా పలికినా అందులో అణువంత మొండితనమూ ధ్వనించింది. “పెళ్ళి చేసుకునే ప్రసక్తే లేదన్నావు. శాశ్వతంగా స్టేట్స్‌లోనే సెటిలవ్వాలని వెళ్ళావు కదూ.”

“ఇప్పటికీ ఆ అభిప్రాయంలో మార్పులేదు”

“మరిప్పుడెందుకొచ్చావ్”

“అది మీకు అర్థం కాదు గ్రాండ్ పా- ” అందామె కళ్ళు నీళ్ళు పర్యంతమవుతుంటే ఇలాంటి ఆహ్వానాన్ని అందుకున్నందుకు బాధగా బయటికి వచ్చేసింది.

ఎంత సేపు చీకటిలోకి చూస్తూ నిలబడిందో ఆమెకే గుర్తులేదు.

“బాధ పడుతున్నావా” డాక్టర్ మహంతి గొంతు వినిపించింది

"మీ గ్రాండ్ పా తత్వం నీకు తెలుసు"

ఇక నిభాయించుకోలేక పోయిందామె. "తెలుసు అంకుల్- జీవితమంటే వ్యాపార బంధాలే తప్ప అనురాగ బంధాలు కావని గ్రాండ్‌పా ఆలోచిస్తారని తెలుసు. అది నిరూపించటానికి ఏ స్థాయికయినా వెళ్ళగలడు నా గ్రాండ్ పా అని నాకు తెలుసు. కాని ఇన్ని నెలల తర్వాత, అభిమానం చంపుకుని చూడడానికి వచ్చిన నన్ను 'ఇంత సాదరంగా ఆహ్వానిస్తారని మాత్రం తెలుసు కోలేకపోయాను."

ఏ గతపు స్మృతి శకలాలు కదిలి ఆమెను కలవర పరుస్తున్నాయో ఆమె కళ్ళు నీటి కుండలయ్యాయి.

"పిచ్చి పిల్లా- తాతయ్య పై అభిమానం వుండాలే కాని స్వాభిమానం ఏమిటమ్మా- నిజమే ఉపాధ్యాయ దశాబ్దాల కృషిలో చాలా అనుబంధాలకి దూరమయ్యాడు. సామ్రాజ్య విస్తరణే ధ్యేయంగా పెట్టుకుని ఈ ప్రపంచంలో తనకున్నది నువ్వొక్క ర్తివే అన్న విషయాన్నీ విస్మరించాడు. అంత మాత్రం చేత నీ మీద ఆయనికి అభిమానం లేదని ఎలా అనుకుంటున్నావు"

"వద్దు అంకుల్- ఇక ఆ విషయాలను మనం చర్చించుకోవద్దు"

చాలా సేపటి నిశ్శబ్దం తర్వాత అడిగాడు "ఇప్పుడేం చేయాలనుకుంటున్నావ్"

"స్టేట్స్‌కి వెళ్ళిపోతాను. ఇక మళ్ళీ జన్మలో ఈ దేశంలో అడుగుపెట్టను."

"అప్పుడు నీకూ మీ తాతయ్యకీ తేడా ఏముందీ! ఓ భ్రాంతిని జీవితంగా మార్చుకుని బ్రతుకుతున్న మీ తాతయ్యకి నువ్వు తప్ప ఎవరూ లేరమ్మా. 'నా కెవరున్నారూ' అని కాదు, 'తాతయ్యకి నేను తప్ప ఎవరున్నారూ' అని ఆలోచించగలిగితే నీ జీవితానికి ఓ కొత్త లక్ష్యమూ గమ్యమూ దర్శనమిస్తాయి. నీకు తెలీదు కృషి! మీ తాతయ్య ప్రపంచంలో దేన్నయిన కొనగలననే స్థాయికి ఎదిగాడేమో కాని మృత్యువుని బేరం చేయగలననేటంతగా మాత్రం కాదు"

ఇంతకు మించి అవకాశం రాదన్నట్టుగా చెప్పుకుపోయాడాయన.

"ఇప్పుడు మీ తాతయ్య ఏ స్థితిలో వున్నదీ నీకు తెలీదు. అసలు మానసికంగా అతడెంత కృంగిపోతున్నది నీకు అర్థం కాదు. ప్రభుత్వం మారింది. ఆ ప్రభుత్వం మీ తాతయ్య ప్రత్యర్థులకి అనుకూలంగా వుంది. దానితో మీ తాతయ్య బిజినెస్ ఎంపైర్‌లో సమస్యలు మొదలయ్యాయి. ఆ సమస్యలే ఈ రోజు మీ గ్రాండ్ పా కొలాప్స్ కావటానికి కారణమైంది కూడా. ఇదంతా నీకు చెప్పకూడదనుకున్నాను కృషి! మీ గ్రాండ్‌పాకి సైతం చెప్పని అనారోగ్యం వివరాలు నాలోనే సమాధి చేసేసుకోవాలనుకున్నాను."

చెప్పాడు ఉపాధ్యాయ అనారోగ్యం గురించి వివరంగా. "మెదడులోని స్పెసిఫిక్ ఏరియాకి రక్తాన్ని తీసుకుపోయే ఆర్టిరీ బ్లాకయ్యే స్థితి TIA (TRANSIENT ISCHAEMIX ATTACK)

హెమరెంజ్‌కి దారి తీయవచ్చు. సర్జరీలో బ్లాకేజ్‌ని తీసేయడం సకాలంలో జరగడంతో ఉపాధ్యాయ ఇప్పుడు యధాస్థితికి రాగలిగాడు కాని మరోసారి యిలాంటి అటాక్ రాదన్న గ్యారంటీ లేదు. వస్తే ఇక బ్రతికే అవకాశమూ లేదు.

"మీ తాతయ్య కోసం నిన్ను శాశ్వతంగా ఇక్కడే వుండి పొమ్మనడం లేదు కృషి! ఈ స్థితిలో ఆయన్ని విడిచి వెళ్ళడం న్యాయం కాదంటున్నాను. నిజానికి ఉపాధ్యాయకి సెంటిమెంట్స్ పై నమ్మకం వున్నా లేకపోయినా ఇప్పుడాయనకి కావలసింది అటాచ్‌మెంట్. ఒకవేళ ఆయన కోరిక ప్రకారం నువ్వు పెళ్ళి చేసుకుని వుంటే బహుశా ఆయన. . ."

అర్ధోక్తిగా అంది కృషి "అసంభవం అంకుల్"

ఉద్విగ్నంగా కదిలిపోయింది. "ఇక ఈ జన్మకి అలాంటి ఆలోచన లేదు. ఉండబోదు."

అచేతనంగా వుండిపోయాడు డాక్టర్ మహంతి.

0 0 0 0

రాత్రి ఎనిమిది గంటలు కావస్తూంది. శూన్యాకాశపు కేన్వాసుపై పేరుకున్న నక్షత్రాలు హుస్సేన్ సాగర్‌లో ప్రతిఫలిస్తుంటే నిశ్శబ్దంగా చూస్తుంది కృషి.

గ్రాండ్ పా సింగపూర్ వెళ్ళి రెండు రోజులైతే ఆయన హాస్పిటల్ నుండి విడుదలై నాలుగు రోజులైంది. పట్టుదలలో ఆ తాతయ్యకి మనవరాలైన ఇదే టెన్షన్‌లో ఆయన పని చేస్తే ఇక ఎక్కువకాలం బ్రతకడన్న ఆలోచన ఆమెను తాత్కాలికంగా ఇక్కడే వుండేట్టు చేసింది కూడా.

ఏం చేయాలో ఇదమిత్తంగా నిర్ణయించుకోలేదామె. తాతయ్య ముభావం బాధ పెడుతున్నా నిగ్రహించుకుంటోంది. హాస్పిటల్ నుంచి విడుదలయ్యాక మళ్ళీ వ్యాపారంలో మునిగిపోయాడు. తన స్థితి ఏమిటి అన్నది ఆయనకి తెలీదు. తెలిసినా పట్టించుకుంటాడన్న నమ్మకం లేదు.

కృషి ఇక ఇంటికి బయలుదేరింది.

సరిగ్గా అప్పుడు జరిగిందో అనుకోని సంఘటన. . . ఆదమరచి కూర్చున్న కృషి చేతిలోని వేలెట్‌ని లాక్కుని పరుగెత్తాడో వ్యక్తి.

ఆమె కేకలు పెట్టలేదు.

కాని దొంగ దొంగ అంటూ మరో వ్యక్తి అటుగా దూసుకుపోయాడు.

చుట్టూ చేరిన జనం అనవసరమైన సానుభూతిని ప్రదర్శించడాన్ని యిష్టపడనట్టు మెట్లెక్కి టాంక్‌బండ్ పైకి వచ్చింది ఆమె.

ఓ వారగా పార్క్ చేయబడిన కారులో కూర్చోబోయింది.

"మేడమ్" పిలిచారెవరో.

సమీపంలో నిలబడి వున్నాడో యువకుడు. సుమారు ఆరడుగుల పొడవులో పోతపోసిన విగ్రహంలా అనిపిచాడు. మాసిన గెడ్డం, విషాదాన్ని మోస్తున్నట్టు కనిపించే చూపుల్తో చేతిని ముందుకు చాచాడు.

"ఈ వేలెట్ మీదే అనుకుంటాను"

విస్మయంగా అందుకుంది "అఫ్‌కోర్స్"

"మీరీ వూరికి కొత్తో లేక వయసులో వుండడంలో కలల్లోకి జారి అజాగ్రత్తగా వున్నారో నాకు తెలీదు కాని ఇక ముందైనా కేర్‌ఫుల్‌గా వుండండి."

నిర్మోహమాటంగా అతడు మాట్లాడగలిగినదుకు అభినందించింది కాని కలలూ జాగ్రత్తలూ అంటూ అతడు చనువు తీసుకోవడాన్ని అంగీకరించలేకపోయింది. "యూ సీ మిస్టర్"

"కోపం తెచ్చుకోకండి మేడమ్" ఇందాక దొంగ వెంట కేకలు వేస్తూ పరిగెత్తిన వ్యక్తి ఇప్పుడు అతడి తరపున వత్తాసుగా అన్నాడు. "ధూర్జటిగారి తీరే అంత- దొంగలకి పక్కలో బల్లెంలా వుండడంతో బాటు అజాగ్రత్తగా వ్యవహరించే వ్యక్తుల మీద కూడా ఇలా విరుచుకుపడుతుంటాడు."

కదలబోయిన ధూర్జటిని చూస్తూ అంది "ఎక్స్ క్యూజ్మీ. . . మరోలా అనుకోకపోతే" వెయ్యి రూపాయలు అందించబోయింది.

ధూర్జటి నేత్రాలలో రవ్వంత ఆవేశం కనిపించింది. "అంటే నేను చేసిన చిన్న సహాయానికి ఇలా ఖరీదు కట్టాలనుకుంటున్నారా."

"సారీ. . . ఈ వేలెట్లో ఇరవై వేలు సేఫ్‌గా వెనక్కి తెచ్చారు కాబట్టి చిన్న రివార్డ్." ఆమె నొచ్చుకుంటున్నట్టుగా అంది.

వెళ్ళిపోతున్నాడు ధూర్జటి.

"మేడమ్" ఇంకా సమీపంలోనే నిలబడ్డ యిందాకటి వ్యక్తి అన్నాడు. "ధూర్జటిగారు ఓ అనాధ నిరుద్యోగి మాత్రమే కావచ్చు. ఆపదలో వున్న వాళ్ళపై సానుభూతి చూపించడం ఆయన బలహీనత కావచ్చు అంత మాత్రం చేత డబ్బుకాయన లొంగిపోతాడని ఎలా అనుకున్నారు? అంతకన్నా ఆయన పసి పిల్లల కోసం నడిపే శరణాలయానికి డొనేషన్ అని ఇచ్చి వుంటే బాగుండేది."

ఆ వ్యక్తి ఇంకా మాట్లాడుతూనే వున్నాడు. కారులో కూర్చున్న కృషి వేగంగా ముందుకు పోనిచ్చి నడుస్తున్న ధూర్జటి పక్కన ఆపింది. అతడు అబ్బురంగా చూస్తుండగానే అయిదు వేల రూపాయిల బోట్లకట్టని అతడికి అందించింది. "యిది మీ కష్టానికి నేను కడుతున్న ఖరీదు కాదు. మీరు ప్రేమగా పెంచే పసి పిల్లలకి డొనేషన్"

డబ్బు తీసుకున్న ఆ యువకుడు ఆశ్చర్యంగా చూస్తుండగానే కారుని ముందుకు పోనిచ్చింది.

ఆ సంఘటనని సైతం కృషి మరిచిపోయేదే.

కాని కొన్ని పరిచయాలు మరికొన్ని విచిత్రమైన సన్నివేశాలకి కారణమౌతుంటాయి.

మరుసటి రోజు సాయంకాలం బంజారా రెస్టారెంట్‌కి వెళ్ళిన కృషి అనుకోకుండా చూసింది నిన్నటి ధూర్జటిని

అతడ్ని మాత్రమే కాదు. అతడితో బాటు నిన్న అతడి ఔనత్యం గురించి మాట్లాడిన వ్యక్తిని, తన చేతిలోని వేలెట్ లాక్కుపోయిన దొంగని కూడా.

ముగ్గురూ ఓ టేబుల్ ముందు కూర్చుని ఉత్సాహంగా మాట్లాడుకుంటున్నారు.

బహుశా తనను ఫూల్ చేసిన శుభ సందర్భంలో పార్టీ చేసుకుంటున్నారేమో.

ఆ సంఘటన్ని మామూలుగ తీసుకునే మూడ్‌లో లేదామె. డబ్బు పోయినందుకు కాదు. - ఈ దేశంలో యువత ఎంత నిర్వీర్యమైపోయింది అర్థమైనట్టు ఆవేశంగా కౌంటర్ దగ్గరకి నడిచి పోలీసులకి ఫోన్ చేసింది.

అంతే-

పది నిముషాల్లో జీపులో వచ్చారు పోలీసులు.

ఇదేమీ గమనించని ఆ మిత్రత్రయం ఇంకా ఉత్సాహంగా మాట్లాడుకుంటున్నారు ఇంకా టేబుల్ ముందే కూర్చుని.

యస్సయ్‌కి ఎదురు వెళ్ళిన కృషి తన కుటుంబ వివరాలు చెప్పకుండా తనను తాను పరిచయం చేసుకుంది.

టేబుల్ దగ్గర కూర్చున్న ధూర్జటిని, మిగతా ఇద్దర్నీ చూపిస్తూ నిన్న సాయంకాలం తనతో జరిపిన "ఫౌల్ ప్లే" గురించి వివరించింది.

ఉన్నింటి యువతి పైగా చాలా అందమైన అమ్మాయి తన సహాయాన్ని అర్థించడంతో ఉత్సాహపడిన యస్సయ్ వెంకట్రావ్ "అరెస్ట్ హిమ్ " అన్నాడు తన వెంటవున్న పోలీసుల్తో.

అప్పుడు చూశాడు ధూర్జటి కృషిని. జరగబోయేదేమిటో గ్రహించిన ముగ్గురిలో ఇద్దరు పరుగు లంకించుకోగా ధూర్జటి మాత్రం మొహంపై నవ్వు పులుముకుంటూ ముందుకొచ్చాడు. అంత పర్సనాలిటీ వుండి పారిపోవటం పరువు తక్కువన్నట్టుగా.

"హలో" పలకరించాడు కృషిని చూస్తూ. "పోలీసులతో వచ్చావేమిటీ" అన్నాడు చాలా పరిచయమున్నట్టుగా.

"ఎందుకొచ్చిందీ స్టేషన్‌లో డిసైడవుతుంది నడు" కృషిని మరింత ఇంప్రెస్ చెయ్యాలనుకున్న యస్సయ్ ఇంచుమించు నెడుతూ ధూర్జటిని జీపు దగ్గరికి నడిపించాడు.

ధూర్జటి నిర్లక్ష్యంగానే కాదు నిర్భీతిగా ప్రవర్తించడం కృషికి విస్మయంగా వుంది.

జీపు ఎక్కుతూ అన్నాడు కృషిని చూస్తూ "ఓకే. త్వరలో కలుస్తాను."

అతడలా అన్నందుకు కాదు గాని జీపులోంచి ధూర్జటి సీరియస్‌గా తనను ఆపాదమస్తిష్కం గమనించడాన్ని ఈజీగా తీసుకోలేకపోయింది.

తను అనవసరమైన రొంపిలో అడుగు పెట్టిందా.

ధూర్జటి చూపే ఇంకా ఆమెను వెంటాడుతూ ఆందోళన కల్గిస్తూంది.

0 0 0 0

బయట కుండపోతగా కురుస్తున్న వర్షం. . . వున్నట్టుండి మొదలైన ఈదురుగాలి. అయినా ఆమె పట్టించుకోలేదు. 'ప్రోడిగల్ డాటర్' నవల్లోని ప్రతి కథా ఆమెకు విచిత్రమైన స్ఫూర్తిని అందిస్తుంటే తెల్లవారేలోగా పూర్తి చేయ్యాలనుకుంది.